# ఆద్యంతాల నడుమ నేను

రమాకాంతరావుగారి అంతటి వాడికి నా సహాయం ఎందుకు కావలసి వచ్చిందో నాకు ఒకవిధాన అంతుపట్టలేదు. ఆ ఉత్తరం చూస్తూనే ఆశ్చర్యపోయాను. పదిమందిని ఆదేశించగల శక్తి, సామర్థ్యం ఉన్న ఆయనకు నే నేవిధంగా పనికొస్తానా అని విస్తుపోయాను. అందునా, అన్నివిధాలా అణిగిమణిగి, ఆయన నిర్ణయాలను కిమ్మనకుండా నిర్వర్తించే సుపుత్రుడు సత్యంమీదే నన్ను ఉపయోగించబోవటం నన్ను మరింత ఆశ్చర్యపరిచింది.

చల్లగాలిలో మరోసారి ఆయన ఉత్తరం చదవాలనిపించి జేబులోనుంచి తీశాను.

"శేషూ !

నీవు ఎంత త్వరగా రాగలిగితే అంత త్వరగా రా. పదిరోజు లుండేటట్టు రా సుమా! ఈ మధ్య సత్యం మరీ పెళుసువాడయిపోతున్నాడోయ్!

—రమాకాంతరావు"

ముక్తసరిగా మాటలు ఎంత తూచి తూచి మాట్లాడతాడో అట్లాగే ఉత్తరం వ్రాశాడు. ఇక తప్పేదేముంది? ఆ రోజు తెల్లవారుఝాము రైలుకే పెట్టే బేడాతో స్టేషనుకు బయలుదేరాను.

C 5

బండిలో కూర్చుంటే సత్యం మెదిలాడు మనస్సులో. వాడసలే అర్భకుడు. సన్నగా, పొడుగ్గా—ఊచలాగా ఉంటాడు. డబ్బున్నవాళ్ళందరూ పుష్టిగా ఉంటారనే అపవాదు మనదేశంలో ఉన్నా, వాడి విషయంలో మాత్రం అది వర్తించదు. అన్నం తిన్న మరుక్షణంలో చూచినా వారం రోజుల క్రితం కంచం ముందు కూర్చున్నట్లుంటుంది వాడి ముఖం!

వాడు దైహికంగా ఎంత బలహీనుడో-మానసికంగానూ అంతే! కానీ, మెరుగైన గుణం వాడిలో ఒకటుంది. అనుకున్నది చేస్తాడు! నెగ్గాననిపించుకుంటాడు. అయితే ఆ పంతంలో ప్రత్యర్థి వాళ్ళ నాన్న కాకుంటే సరి!

ఉన్నట్లుండి నాకు అనుమానం వచ్చింది-సత్యం కానీ నా ఆస్తి నాకు వేరే పంచి పెట్టేయమని అడగలేదు కదా?-అని. మరుక్షణంలోనే నా ఆలోచనకు నాకే నవ్వొచ్చింది. అలా అంటూ జరిగితే రమాకాంతరావుగారు ఇక వాడిని బతికి ఉండనిచ్చేనా? అయినా సత్యమా, అడిగేది? ఛా ఛా!

రైలు గుంటూరు వచ్చేటప్పటికి ఎనిమిది గంటలయింది. పెట్టె బేడా రిక్షాలో పెట్టుకొని రమాకాంతరావు గారి ఇంటి ముందు దిగేటప్పటికి మొట్టమొదటిసారిగా ఆయనే ముందువాలో వాలుకుర్చీలో పడుకొని పేపరు చదువుతూ కనబడ్డారు.

ఆయన నన్ను చూస్తూనే హుషారుగా, "రావోయ్! రా, శేషూ! నీవిచ్చినంత గౌరవం మావాడిస్తే స్వర్గంలో తిరిగినంత సంతోషించేవాడిని!" అన్నారు.

నా రాకకు ఆయన చూపిన హర్షాన్ని చూస్తే, సత్యం ఏదో పెద్ద చిక్కే లేవదీసినట్లున్నాడనిపించింది. అర్భకుడు అణిగిపోడుగదా? అని భయమూ వేసింది.

చిరునవ్వుతో పెట్టె, బెడ్డింగు లోపలికి పట్టించుకుని వెళ్లాను.

నా గొంతు పసిగట్టిన పిన్ని అప్పుడే బయటకువచ్చి, "ఏమోయ్, ఇదేనా రావటం? రా రా! అంతా కులాసానా?" అంది సాదరంగా.

రమాకాంతరావుగారు నవ్వారు. "బాబూ, శేషగిరీ, లోపలికిపోయి మీ పిన్ని ఆతిథ్యాన్ని స్వీకరించి త్వరగా వచ్చెసెయ్యి. ఆలస్యం చేసేవు సుమా! నాకు వేరే పనుంది-వెళ్లాలి!"

ముఖం కడుక్కొని వచ్చేటప్పటికి వంటింట్లో పీటేసి హోటల్ నుండి తెప్పించిన ఇడ్లీ పెట్టింది పిన్ని. అవి తిని కాఫీ తాగి, ఆమె అడిగిన నాలుగు ప్రశ్నలకూ సమాధానాలు చెప్పి అసలు సంగతి తెలుసుకోవాలనే ఆత్రంతో బయటికి వచ్చాను.

ఇక్కడ ఒక్కమాట చెప్పాలి. 'పిన్ని' అంటే వాళ్లు మాకేం చుట్టాలు కారు. ఒకఊళ్లో, నా చిన్నతనంలో

ఇంటిపక్క—ఇంట్లో పదేళ్లు ఉండి, చుట్టాలకంటే కూడా మరీ దగ్గరయిపోయారు. దానికితోడు క్రితం సంవత్సరమే నేనూ, సత్యం ఒకేసారి ఎమ్. బి. బి. ఎస్. లో చేరాము.

రమాకాంతరావుగారికి ఎదురుగా నేను లోపలికి అడుగుపెడుతున్నప్పుడు లేని ఒక ఖాళీ కుర్చీ ఇప్పుడున్నది. అంటే-అది నాకోసమే వేయించారన్నమాట! మెదలకుండా వెళ్ళి కూర్చుని, 'నన్ను పిలిపించడానికి కారణమేమిటి?' అన్నట్లు ఆయన ముఖంలోకి చూచాను.

ఆయన చిన్నగా దగ్గి, ''అబ్బాయ్! సత్యానికి ఒక మేనత్త ఉంది. ఆమెకు ఒక్కతే కూతురు. అందమూ, గుణమూ అంటావా-సంసారపక్షంగా ఉంటాయి. వాడు ఒక రాజాలాగా జీవించాలనే నా ఉద్దేశం. ఎన్నాళ్ళయినా సరే, ఏ అడ్డంకీ చెప్పకుండా ఉండి, వాడు ఆ అమ్మాయిని వివాహం చేసుకునేటట్లు ఒప్పించి మరీ వెళ్ళు!'' అని ఒక్క క్షణం కూడా అక్కడ ఆగకుండా, లేచి నిలబడి వడివడిగా అడుగులేసుకుంటూ, సింహద్వారంలాంటి ఆ వాకిలి దాటి వెళ్ళిపోయారు.

నేను నిశ్చేష్టుడినయ్యాను.

తేరుకొని తలెత్తేటప్పటికి రమాకాంతరావుగారు వెళ్ళిన వాకిలినుండే ఊగుకుంటూ సత్యం లోపలికి వస్తున్నాడు.

నన్ను చూస్తూనే ఆనందంగా పరుగెత్తుకుంటూ

వచ్చి కావిలించుకున్నంత పనిచేశాడు. "ఏరోయ్, శేషూ! ఎప్పుడు రావటం?"

వాడు మధ్యాహ్నం రెండుగంటలదాకా వేసిన ప్రశ్నలన్నింటికీ ఓపికగా సమాధానం చెప్పాను. ఎందుకంటే వాడి కేవిధంగానూ కోపం రావడం నాకు అభిమతం కాదు. రమాకాంతరావుగారి దృష్టిలో నేను మరింత గొప్పవాడిని కావాలంటే సత్యం, నేనంతవరకూ చూడని ఆ మేనత్త కూతురికి మూడు ముళ్ళూ వేయాలి!

అసలు దీనిలో ఏదో కుంభకోణం ఉందనిపించింది. లేకపోతే సత్యాన్ని రమాకాంతరావుగారే ఒప్పించేవారు! ఆ పని నాకు అప్పగించవలసిన అవసరం ఉండేదే కాదు!

రెండు గంటలకు నిద్ర పట్టింది. నాలుగున్నరకు లేచాను. ముఖం కడుక్కునేటప్పటికి పిన్ని నాకూ, సత్యానికీ టిఫిన్ పెట్టింది. మాటలు చెప్పుకుంటూ తిన్నాము. కాఫీ తాగి రోడ్డెక్కాము.

ఓవర్ బ్రిడ్జి మీదుగా గాంధీ పార్కులో చేరి మారు మూల ఉన్న ఒక సిమెంటు బెంచీమీద కూర్చునేటప్పటికి పశ్చిమాద్రికి సూర్యుడు పూర్తిగా క్రుంగిపోయాడు. పెద్ద పెద్ద మేడల మధ్యగా ఉన్న ఆ పార్కులో మ్యునిసిపల్ దీపాలు వెలిగాయి. చెట్ల గాలి చల్లగా ఉంది. దూరాన స్పీకర్‌లో లలిత సంగీతం వినబడుతున్నది.

నాలుగువైపులా పరికించాను. వాతావరణంచూ సే-

రమాకాంతరావుగారు నామీద మోపిన భారానికి నాందీ ప్రస్తావన చేయడానికి ఆ సమయం బాగుంటుందేమో నని పించింది. ఒక్కసారి జాగ్రత్తగా తల వంచుకొని ఉన్న సత్యం ముఖంలోకి చూచి, గొంతు సరిచేసుకుంటున్నట్లు చిన్న దగ్గు దగ్గాను.

కానీ, అనుకోకుండా, నన్ను మాట్లాడనీయకుండా వాడే గొంతు విప్పాడు. "అరేయ్, శేషూ! ఇవాళ నిన్ను దేవుడు నాకోసం పంపినట్లుగా భావిస్తున్నానురా. అసలు నేనే నిన్ను వెంటనే రమ్మనమని ఉత్తరం వ్రాద్దామనుకుంటున్నాను. ఆ విషయం నిన్ను చూచినప్పటినుండీ ఎప్పుడు చెబుదామా అని తహతహలాడుతున్నాను!"

నా గొంతు ఎవరో నొక్కినట్లయింది. వీడుగాని మరొకరిమీద నన్ను ఉపయోగించబోవడం లేదుగదా?

నోరు పెగుల్చుకొని ఏదో అనబోయాను. వాడు మాట్లాడనిస్తేనా! "అరేయ్, శేషూ!" అంటూ తిరిగి మొదలుపెట్టాడు. "నాకు ఒక విధవ మేనత్త ఉంది... ఆమె నీకు తెలియక పోవచ్చులే. ఎందుకంటే ఈ మధ్యనే కొత్తగా చుట్టరికం కలిపి ఆమెను నాకు మేనత్తగా చేసి కూర్చోపెట్టాడు మా నాన్న."

"సరి సరి. కానియ్యి." నేనేదైతే ప్రారంభిద్దామనుకున్నానో అదే వాడు మొదలుపెట్టడంతో అసలు ఆ విషయాన్ని వాడి ముందు ఎలా తీసుకురావాలా అని సతమత

మవుతున్న నేను తేలిగ్గా శ్వాస పీల్చుకొని ఆసక్తిగా విన సాగాను.

"ఆమె ప్రస్తుతం ఈ ఊళ్ళోనే ఉంది. ఆమె కనీసం రెండు లకారాల కయినా అధికారిణి అని మా నాన్న అంచనా. అంతటితో అయితే సరిపోయేదే. నేనూ సంతోషించేవాడినే. కానీ ఆమెకో 'అప్సరస' కూతురున్నది. ఆమెను కోడలుగా చేసుకోవాలంటాడు మా నాన్న, నన్ను ఎరగా చూపించి. అంటే ఆ కుటుంబంమీద ఆసక్తితోనూ కాదు; నా సుఖంకోసమూ కాదు. ఆమె వెనక ఉన్న డబ్బును ఎప్పుడు వాటేసుకుందామా అని ఎదురుచూస్తు న్నాడు. అందుకని నీవు ఇక్కడ నాకోసం ఎన్నాళ్ళయినా సరే ఉండి ఆయన ఉచ్చులనుండి నన్ను రక్షించి, ఈ పెళ్ళి నుండి ఎట్లాగైనా సరే తప్పించుకునేలా మాత్రం చూడు!"

నేను బిత్తరపోయాను.

రమాకాంతరావుగారి మాటలకు ఎంతగా నిశ్చేష్టుడి నయ్యానో, ఈసారి సత్యం మాటలకు అంత నిర్జీవుణ్ణ య్యాను. 'హరి భగవంతుడా! ఈలాంటి వ్యూహంలోనా నేను చిక్కుకున్నది?'

నా పని చెరువుగట్టుమీద పడ్డ చేపగతి అయింది.

క్లాక్ టవరు ఏడుగంటలు కొట్టిందాకా సత్యాన్ని వాడి వాడి వాదానికి బలాన్ని చేకూర్చుకోనిచ్చి, లేచి నిలబడ్డాను. కాని నా నోరు విప్పలేదు. అసలు ఏం మాట్లా

డాలో నాకే తెలియటంలేదు. సగం సగం ఆలోచనలతో ఏదో నోరుజారి అన్నా, తరువాత ఆ మాటలను చేతల్లో కూడా సమర్థించుకోలేక చావాల్సి వస్తుంది.

ఇంటిదాకా మౌనమే శరణ్యం!

భోజనాలయ్యేటప్పటికి తొమ్మిది గంట లయింది. వక్కపలుకు వేసుకొని వాకిట్లోకి వచ్చాను. సత్యం ఎందు కనో లోపలే ఆగిపోయాడు.

నేను ఒంటరిగా ఎప్పుడు కనబడతానా అని ఎంత సేపటిబట్టి ఎదురుచూస్తున్నారో ఏమో, పడక్కుర్చీలో కూర్చుని చుట్ట తాగుతున్న రమాకాంతరావుగారు నన్ను చూస్తూనే లేచి, నా దగ్గరికి వడివడిగా వచ్చి, గొంతు తగ్గించి, ''నేను దీనికోసం నిన్ను పిలిపించినట్లు వాడికి మాత్రం తెలియనీయకుసుమా!'' అని మరుక్షణంలోనే నావద్దనుండి వెళ్ళి, తన పడక్కుర్చీలో పడుకుని తాపీగా, ఏమీ జరగనట్లుగానే చుట్ట కాల్చసాగారు.

ఆయన భావాలకు, మాటలకు ఏడవాలో, నవ్వాలో కూడా తెలియని అయోమయంలో పడ్డాను నేను.

కొడుకుముందు ఎక్కడ తేలికవుతానోనని ఆయన భయం!

ఆ రాత్రి నాకు నిద్ర కరువైంది.

మరునాడు తెల్లవారేటప్పటికే రమాకాంతరావు గారు ఏదో పనిమీద ఇంట్లోనుంచి వెళ్ళిపోయారు. నేను,

సత్యం స్నానపానాదులు కానిచ్చేటప్పటికి ఎనిమిదికి పది నిమిషాలు తక్కువయింది.

సత్యం గదిలో చెరో పుస్తకం ముందేసుకు కూర్చున్నాము.

అక్కడ నా పరిస్థితికి నాకే నవ్వు వచ్చింది. నాకు కావలసిన ఇద్దరూ ఒకళ్ళకు తెలియకుండా ఒకళ్ళు, ఒకరి మీద మరొకరు నా ద్వారా వారి వారి ప్రభావాలను చిత్రీకరించుకుంటున్నారు. హతోస్మి! మధ్యలో నేను గాని నలిగి పోనుగదా?

అలా అని అసలు రంగంలోకి దిగకుండానూ ఉండలేను.

రాత్రి పార్కులో సత్యం చెప్పినదానినే తిరిగి మరో సారి వినాలనిపించింది. అదే అడిగేశానుకూడా.

మరుక్షణంలోనే వాడు నోరువిప్పి చెప్పేయసాగాడు. అసలు ఆ విషయంలో వాడిని సమర్థించేందుకు ఆ గృహంలో నేను తప్ప ఎవరూ లేనట్లున్నది. అది వాడి ఉద్దేశ్యంలోనే సుమండీ! ఎందుకంటే—నాకుగా నేనే ఆ మాటంటే రమాకాంతరావుగారు నన్ను పిలిపించిన ఉద్దేశ్యం సమూలంగా నాశనమైనట్లే!

"నేను వివాహం చేసుకోకపోవడానికి కారణాలు చెప్పమంటావా?—ఒకటి, అమ్మాయి అప్సరస!" అని పెద్ద పెట్టున నవ్వి, మరుక్షణంలోనే గంభీరుడై, "ఆ అమ్మాయిని

నా భార్యగా చేసి కూర్చోబెట్టడంలో మా నాన్న ఉద్దేశ్యం నాకు నచ్చలేదు గనుక—నేను డాక్టరు పట్టా చేతిలో చిక్కించుకునేంతవరకూ అలాంటి బంధం నా మెడకు తగిలించుకోవడం నాకంత శ్రేయస్కరం కాదనీ..." చెప్పుకు పోతున్నాడు.

"చాలు, సత్యం, చాలు! ఇక ఆపేసెయ్యి. ఆ అమ్మాయి ఒక్క 'అప్సరస' అన్న కారణం తప్ప మరేదీ నీ వాదనకు పుష్టి కలిగించేలా మాత్రం లేదనిపిస్తోంది... సరిసరి! ఇక చదువుకో!" అని నేను మండువాలోకి వచ్చేశాను.

అక్కడ రమాకాంతరావుగారు వాలుకుర్చీలో చుట్ట తాగుతూ ప్రత్యక్షం!

నా ముఖంమీద చిరు చెమట పట్టింది.

ఆయన నన్ను చూస్తూనే చిరునవ్వు నవ్వి, "రావోయ్, శేషూ! అలా కూర్చో!" అన్నారు, ఎదురుగా ఖాళీ కుర్చీ చూపిస్తూ.

చేసేదేముంది? మౌనంగా వెళ్ళి కూర్చున్నాను.

"ఏమంటున్నాడు సత్యం? మొగ్గేటట్లే ఉన్నాడా?" అన్నారు ఆసక్తిగా.

ఆయన ఆదుర్దాకు నాకు కొద్దిగా కోపం కూడా కలిగింది.

లేని నవ్వు తెచ్చుకొని, "ఇంతవరకు నాందీప్రస్తావనే అయింది. ఇక నాటకం జరిపించాలి" అన్నాను.

"తెలివిగలవాడివనే ఈ పని నీ చేతుల్లో పెట్టాను సుమా! అంతా శాంతంగా జరగాలనే నా కోరిక. లేకపోతే ఎటూ ఉండనే ఉన్నది — మెడలు వంచి చేయగల నను కో..." అని ఒక్క క్షణమాగి, "మనం మంతనాలాడుతున్నట్లు మరెవరికంటన్నా పడితే అభాసుపాలవుతాము" అని ఫక్కున నవ్వారు.

ఆయన మాటలు మొట్టమొదటి సారిగా నాలో ఆయన మీద ద్వేషాన్ని కలిగించాయి. ఆయన ఏమైనా చేయగల సమర్థుడు.

సాయంత్రం అయిదు కాగానే రోడ్డుమీదకు బయలు దేరాము. ఆరుగంటల సమయంలో సత్యమే అకస్మాత్తుగా సినిమాకు వెళ్దామని పట్టుపట్టాడు.

టిక్కెట్లు తీసుకుని, మెట్లెక్కి, బాల్కనీలోకి వెళ్ళాము. తలుపుదాకా హుషారుగా వచ్చిన వాడల్లా లోపలికి చూస్తూనే చటుక్కున ఆగిపోయి, వెనుదిరిగి, "అరేయ్, కింద కుర్చీల్లోకి వెళ్దాం పద!" అన్నాడు.

నేను ఆశ్చర్యపోయాను! 'ఇదేమిటి? ఎవరైనా రూపాయిన్నరా చెల్లించుకొని బాల్కనీ టిక్కెట్టుకొని, కింద కుర్చీలో కూర్చుంటానంటారా!' అనుకొని, "మనం కంటపడకూడని పెద్దమనుష్యులెవరైనా లోపలున్నారా ఏం?" అన్నాను సగం నవ్వుతూ.

"ఆహా! లోపల మా నాన్న ఉద్దేశ్యంలో నా కాబోయే అత్తగారు, పుత్రికా రత్నంతో విచ్చేసి ఉన్నారు!"

అన్నాడు. ఆ కంఠంలో కోపం ఉంది. విసుగు ఉంది. గాంభీర్యం ఉంది.

నాకు వాడి ముఖం చూస్తుంటే నవ్వువచ్చింది. నేనూ బిగబట్టుకొని, నా ముఖాన్ని కూడా గంభీరంగా మార్చుకొని, "అయితే పద, ఇక్కడే కూర్చుందాము. ఆమెతో పరిచయం కూడా చేసుకోవలసిందే!" అన్నాను.

వాడు బిత్తరపోయాడు.

"ఆమెతో నీకేంపని?"

నాకు ఇక్కడ చిన్న అబద్ధం ఆడక తప్పలేదు. "అబ్బాయీ! నీ వాదనకు బలం చేకూర్చాలంటే ఆమె మాటల్లోనూ, చేతల్లోనూ ఉన్న లోపాలను మన గుప్పెటలో పెట్టుకోవాలి. పద పద! పుత్రికా రత్నం కూడా వచ్చిందన్నావు గదా? మరీ మంచిది!" అని వాడిముఖంలోకి చూచాను.

వాడు నుదుటమీద పట్టిన చెమట తుడుచుకుంటున్నాడు. 'సినిమాకు ఎందుకు వెళ్దామన్నానా?' అని బాధ పడుతున్నాడు కాబోలు!

"ఇంతకీ ఆ 'కన్య' పేరేమిటన్నావు?"

"వాళ్ళమ్మ ముద్దుగా 'లలిత' అని పేరు పెట్టుకొని, 'లతా' అని పిలుచుకుంటోంది!"

వాడి మాటలకు నాకు నవ్వు వచ్చింది.

చొరవచేసుకుని నేనే ముందుకు అడుగులు వేశాను.

అంత పెద్ద బాల్కనీలో ముదురు రంగు చీరల్లో ఉన్న ఆ అమ్మా కూతుళ్ళే నాకు కనపడ్డారు. నా వెనక ఉన్న సత్యాన్ని చూస్తూనే చేటంత ముఖం చేసుకుని లేచి నిలబడింది—"రండి! రండి!" అంటూ, ఆమె.

ఒక్క క్షణం ఆమె వెనకగా నిలబడిన-నా రాకకు ముఖ్యకారకురాలయిన-ఆ అమ్మాయిని చూచాను. లతను చూస్తుంటే నా మనస్సు గిల గిల లాడింది. పూర్వకాలపు ఆచార వ్యవహారాలకు ప్రతిబింబమయిన రమాకాంతరావు బాబాయిగారి ఉద్దేశ్యంలోలాగా అందవిహీనంగానూ లేదు; పందొమ్మిదివందల అరవై రెండవ సంవత్సరంలో ఎమ్. బి. బి.ఎస్. చదువుతున్న సత్యానికి నచ్చేటట్టూ లేదు.

"అబ్బాయి మిత్రుడు శేషగిరి కాదుగదా మీరు?" అంది సంశయిస్తూ.

"ఆ! అక్షరాలా" అన్నాను. "ఆ శేషగిరినే!"

అంటే నా రాక ఆమెకుకూడా తెలుసునన్న మాటేగా?

ఆమె తరువాత ఒక కుర్చీ ఖాళీవదిలి పెట్టి నేను కూర్చున్నాను. నా పక్క సత్యం కూర్చున్నాడు. ఎంత హుషారుగా సినిమా చూద్దామని వచ్చాడో అంత నిస్సారంగా ఉంది వాడిముఖం ఇప్పుడు.

లత నా మనస్సులో మెదిలింది. ఏడు గజాల చీరలో పీలగా ఉన్న కన్య! తలమీద తేలికగా జుట్టూ,

చిన్న నుదురూ. ఆకారంలో ఇది లోపమని చెప్పలేము కానీ, అందగత్తెల్లో లెక్క కాదు. అంతమాత్రాన కురూపి అనీ అనలేము.

సినిమాహాల్లో కూర్చున్నంతసేపూ మాట్లాడుకున్న మాటల్లో అంత ప్రత్యేకత ఏమీ లేదు.

సినిమా అయిన తరువాత బాల్కనీ మెట్లు దిగుతూంటే, "అబ్బాయ్, సత్యం! రేపు శేషగిరిని తీసుకొని మనింటికి రా" అంది ఆమె.

వాడు తల వంచుకునే గుమ్మటంలాగా ఊపాడు.

మరునాడు మధ్యాహ్నం భోజనంచేసి వరండాలోకి వచ్చేటప్పటికి రమాకాంతరావుగారు ఆ కాస్తా అడిగేశారు కూడా. "నిన్న మీకు రాజ్యలక్ష్మి సినిమాహాలులో కనబడిందట గదా?"

"అవును!" అన్నాను ముక్తసరిగా.

"లతనుగూడా చూచావుగా?" ఆయన గొంతు ఎందుకనో గంభీరంగా ఉంది.

"ఊఁ."

ఎలా ఉంది?—అని అడుగుతారేమోనని ఒక్క క్షణం తడబడ్డాను. ఎందుకనో ఆయన ఆ ప్రశ్న అడగనే లేదు.

•

ఐదు నిమిషాలు నిశ్శబ్దం భరించిన తరువాత ఆయన గొంతే తిరిగి వినిబడింది. "వాళ్ళింటికి ఈ రోజు వెళతారు

గదూ?'' ఆ మాటల్లో ఆజ్ఞ మిళితమై ఉన్నదనిపించింది నాకు. మనస్సులోనే కోపాన్ని దిగమింగుకుని, ఒక్క క్షణం ఆయన ముఖంలోకి చూచాను.

ఆ సమయంలో నా భావాలు ఇవి అని చెప్పలేని అశక్తుడి నవుతున్నాననుకుంటే నా మీద నాకే జాలివేసింది.

అసలు రమాకాంతరావుగారు కూడా సత్యం మేనత్త మీద ఏదో మత్తుమందు జల్లారు. కాకపోయినా—లక్షాధికారి కొడుకు, కాబోయే డాక్టరు అల్లుడు కాబోతున్నాడంటే ఆమె సంతోషించకుండా ఎలా ఉండగలదు?

కాని ఇంత డొంక తిరుగుడుగా ఈ వ్యవహారం జరగటానికి కారణం? నేను ఆ గృహంలో రమాకాంత రావుగారి ఉత్తరానికి జవాబుగా కాలుపెట్టకముందే కొంత నాటకం జరిగి ఉండాలి. నేనే సత్యం ముందు ఈ విషయానికి నాందీప్రస్తావన చేశాననుకోవడం శుద్ధపొరపాటు.

ఆ సాయంత్రం ఒంటరిగా సత్యాన్ని ఊరి బయటకల్లా తీసుకువెళ్ళి, రోడ్డు పక్కన గడ్డిమీద కూర్చున్న తరువాత, ఆ రంగంలోకి తిరిగి వాడిని దింపాను.

''అరేయ్, సత్యం!...ఒక్క విషయం నాకు చెప్పు. నిన్ను మీనాన్న సూటిగా ఇంతకుముందు ఎన్నడైనా, లతను వివాహం చేసుకోమని అడిగాడా?''

ఒక్కక్షణం నా ముఖంలోకి చూచి, ''ఇంకా అంత వరకు రాలేదు. అదీ రోజుల్లోనే ఉందనే నమ్మకం నాకు

బాగా ఉంది. కాని పది పదిహేను రోజుల క్రితం ఒక రోజున అమ్మచేత అడిగించాడు.''

''నీవేమని జవాబిచ్చావు'' ఆత్రంగా అడిగాను.

''ఇంత విషం తిని చావనైనా చస్తానుగానీ, ఆ అమ్మాయిని మాత్రం వివాహంచేసుకోనని ఆమెద్వారానే తిరిగి కబురంపించాను.''

'సరి సరి. ఇంకేం? వాడు అన్నంతపనీ చేస్తాడేమో ననే, నన్ను ఉపయోగించారన్నమాట, రమాకాంతరావు గారు! ఎలాగైనా అనుభవజ్ఞుడు!' అనుకున్నాను.

వాడి జవాబుకు నాకు భయం వేసింది. వాడిమాట చూస్తుంటే ఈ సారి ప్రత్యర్థి వాళ్ళ నాన్నైనా సరే సై యనేటట్లే ఉన్నాడు.

రమాకాంతరావుగారి తత్వమూ నాకు బాగా తెలుసు. ఆయన పట్టుపట్టాడంటే, ఎదటివారు ఎలాంటి వారైనా ఎవరైనాసరే లెక్కించేరకంకాదు. ఇటు సత్యమూ 'నేను ఆ తండ్రికి కొడుకును కాదా?' అంటే ఈ నాటకానికి చివరి అంకం ప్రళయమే అయినా కావచ్చు!

ఆ సాయంత్రం మారుమాట లేకుండా ఇంటివైపు నడక సాగించాము.

ఒక సందు మలుపు దగ్గరకు వచ్చేటప్పటికల్లా సత్యమే అన్నాడు—''ఇదే రాజ్యలక్ష్మమ్మగారి ఇల్లు!'' అని, ఒక పెద్ద మేడ చూపిస్తూ.

"వెళ్దామా?" అన్నాను.

"ఎందుకూ?" అన్నాడు వాడు అయోమయంగా.

"నిన్ను రమ్మనమని ఆహ్వానించింది గదా?"

"అయితే?"

"వెళ్ళటమనేది గౌరవప్రదంగా ఉంటుంది."

"నేను రాను."

"నేను వెళ్ళివస్తాను. నీవు ఇంటికి వెళ్ళు!"

నేను వాడిని బలవంతం చేయదలుచుకోలేదు. ఎందుకంటే-వాడు ఏలాగూ రాడని నాకు బాగా నమ్మకముంది.

అయినా నన్ను వాళ్ళింటికి రమ్మని ఆహ్వానించడంలో ఏదో ఉద్దేశ్యం ఉండి ఉంటుంది రాజ్యలక్ష్మమ్మగారికి. ఆలాంటి ఆమె కోరిక తీరాలన్నా నేను ఒంటరిగా వెళ్ళటమే ఉత్తమం.

సత్యం నన్ను అక్కడే వదిలేసి వెళ్ళిపోయాడు. నాకు తరువాత అనిపించింది, వాడికి ఆవిషయంలో కోపం రాలేదు గదా—అని!

నేను గేటు తెరుచుకొని నిశ్శబ్దంగా ఉన్న ఆ భవనంలో కాలు పెట్టాను. బొరుగులైట్లు తెల్లని కాంతిని విరజిమ్ముతూ ఆ గృహానికి అందాన్ని చేకూరుస్తున్నాయి.

హాల్లో ఉయ్యాల బల్లమీద కూర్చొని ఉన్న ఆమె, నన్ను చూస్తూనే లేచి సంతోషంగా, "శేషగిరి గదూ, మీరు? రండి రండి!" అని ఆహ్వానించి, "సత్యం రాలేదా ఏం?" అంది.

అక్కడిదాకా వచ్చి ఇంట్లోకి రాకుండా వెళ్లాడంటే ఆమె మనస్సు కష్టపెట్టుకోవచ్చునని—"వాడికి వేరే ఏదో అర్జంటు పని తగిలి రాలేకపోయాడు. వద్దామని బయలు దేరాడు కూడా!" అని సర్ది చెప్పాను.

నా మాటలు ఆమె నమ్మిందో, లేదో నాకు తెలియదు. నమ్మినట్లుమాత్రం ఆమె ముఖం మార్చలేదు.

నేను వెళ్ళి ఆమె ఖాళీచేసిన వుయ్యాల బల్లమీద కూర్చున్నాను. ఆమెతో ఏం మాట్లాడాలో నాకేం అర్థం కావటం లేదు.

ఉన్నట్లుండి ఆమె అంది: "ఏ గొడవలూ లేకుండా అంతా సవ్యంగా జరిగితే మీమేలు ఈ జన్మలో మరిచి పోలేను...ఒక్కతే కూతురు. అల్లారుముద్దుగా పెంచు కున్నాను. ఎవరిని చూచినా ఒంటరిదాన్ని చేసి ఆస్తి కాజే ద్దామనే ఉద్దేశ్యంతో ఉన్నవాళ్ళే తప్ప, రమాకాంతరావు అన్నయ్యగారిలా అండన నిలబడే వాళ్లు లేరు" అని చెప్పుకు పోతున్నది.

నా అనుమానం నిజమయింది. రమాకాంతరావు గారు ఆమె కేదో నూరిపోశారు. ఆయనమీద ఉన్న ఆ ఉద్దేశ్యం ఒక పట్టాన ఆమెలో సడలేటట్లు లేదు.

నేను ఒక గంటల్లా కూర్చొని, ఆమె భోజనానికి ఉండమని ఎంత బలవంతంచేసినా, "మరోసారి" అని తప్పించుకొని బయటపడ్డాను.

నేను అక్కడ ఉన్న ఆ గంటసేపులో లత రెండు మూడుసార్లు ఆ హాలులోకి వచ్చింది.

ఆ రాత్రి భోజనాలయిన తరువాత ఒంటరిగా వరండాలో నన్ను నిలవేశారు రమాకాంతరావుగారు—"రెండు మూడు రోజుల్లో నీ ప్రయత్నానికి ముగింపు దొరుకుతుందా?" అంటూ.

రెండు నిమిషాలు ఏం చెబుదామా అని తికమకపడ్డాను.

ఆయన రెట్టింపుతో, నా మౌనాన్ని దూరం చేసుకొని, "ప్రయత్నమైతే రెండు మూడు రోజుల్లో ముగియవచ్చు. కాని ఫలితం ఎలా ఉండేదీ మాత్రం నేను చెప్పలేను" అన్నాను. ఆ విషయంలో నా బలహీనతను ఒప్పుకొనక తప్పలేదు.

ఆ క్షణంలో ఆయన ముఖంలోని భావాలను చూడాలనిపించింది. కొంతకాకపోతే కొంతయినా ముందు ఏం జరగబోయేదీ అర్థంచేసుకునేందుకు అవకాశం ఉండేది. కాని చీకటి ప్రతిబంధకమైంది.

ఆయన మరో మాట మాట్లాడకుండా నన్ను ఒంటరిగా వదిలేసి వాకిట్లోకి వెళ్లిపోయారు.

నేను గదిలోకి వెళ్ళేటప్పటికి సత్యం పుస్తకం చదువుకుంటూ పడుకొని ఉన్నాడు.

వాడి ముఖంలోకి కన్నార్పకుండా ఒక్కక్షణం

ఆ లైటు వెలుగులో చూచాను. నాకు జాలివేసింది. వాడికి నే నే విధంగా సహాయం చేయగలను?

వాడు ఈ ప్రళయానికి కారణమైన ఆ వివాహానికి "ఊఁ" అంటే మబ్బుతునకైనా కనపడని ప్రశాంతత ఏర్పడుతుంది. కానీ ఒక ఆప్తమిత్రుడికి-తన అంతరాత్మకు వ్యతిరేకంగా అయిష్టమైన కార్యాన్ని చేసి ఆనందమయ జీవితాన్ని నాశనం చేసుకోమని నేను తెలిసీ ఎలా చెప్ప గలను?

ఆ రాత్రి నాకు సరిగ్గా నిద్రపట్టలేదు. మాటి మాటికీ రమాకాంతరావుగారు, సత్యం, రాజ్యలక్ష్మమ్మగారు, లలిత నా కళ్లముందు కదిలి నాకు నిద్రపట్టకుండా చేస్తున్నారు. నా మనస్సు పూర్తిగా అల్లకల్లోలమైంది!

నేను సత్యానికి ఆ విషయంలో ఏలాంటి సహాయం చెయ్యలేనని బాగా తెలుసు. రమాకాంతరావుగారు సత్యం మీద యుద్ధం ప్రకటిస్తే జరగబోయే సంఘటనలు, ఫలితాలు చూడలేను.

ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా ఆ ప్రదేశం నుండి బయటపడటం శ్రేయస్కరమనిపించింది—సత్యాన్ని వాడి ఖర్మానికి వాడిని వదిలేసి, నేనుమాత్రం చేయగలిగిం దేముంది-రమాకాంతరావుగారిమీద నా చేతకానితనాన్ని కప్పిపుచ్చుకొని, ద్వేషాన్ని పెంచుకోవటం తప్ప?

మరునాడు మధ్యాహ్నంవరకు అన్యమనస్కంగానే గడిపాను. చిక్కుకున్న వ్యూహంనుండి బయటపడటం ఎలాగ

అకస్మాత్తుగా మా ఊళ్ళో ఉన్న నా మిత్రుడు భాస్కరం మెదిలాడు మనస్సులో. వడివడిగా ఆ మధ్యాహ్నపు మండుటెండను కూడా లెక్కచేయకుండా పోస్టాఫీసుకు నడిచాను.

''భాస్కరం!

తెలిసో తెలియకో, ఒక ఉచ్చులో చిక్కుకున్నాను. దానినుండి రక్షించేభారం నీదేసుమా! వెంటనే వచ్చేయమని ఒక అర్జెంటు టెలిగ్రామ్ నా పేరున గుంటూరు సత్యం అడ్రసుకు ఇచ్చేసెయ్యి. ఒక మిత్రుణ్ణి కష్టసమయంలో ఆదుకోలేక పారిపోతున్నానని చెప్పుకోవటానికి సిగ్గుపడుతున్నాను. మిగతా వివరాలు నీ సమక్షంలో.

శేషగిరి''

ఎక్స్‌ప్రెస్ డెలివరీ స్టాంపులు అంటించి ఆ కవరు పోస్టు డబ్బాలో వేసి స్వేద బిందువులు తుడుచుకుంటూ ఇంటికి చేరాను.

మళ్ళీ రమాకాంతరావుగారు, సత్యం రాజ్యలక్ష్మమ్మగారు, లలిత—ఆ పరిసరాల్లో ఇంకా రెండు రోజులున్నానంటే నాకు పిచ్చెక్కినా ఎక్కవచ్చు.

కానీ అనుకోకుండా ఆ రోజు సాయంత్రమే నే ననుకున్నంతా అయింది. తుఫానుకు సూచనగా గాలివీచినట్లు, ఆ గృహంలో జరగబోయే ప్రళయానికి (నా ఊహలో) సూచనగా రమాకాంతరావుగారు కొన్ని మాటలు వదిలారు.

బజారునుండి పొద్దుపోయిన తరువాత ఇంట్లో ఇద్దరం అడుగుపెట్టాము. ఆ సమయంలో రమాకాంతరావుగారు ఒంటరిగా లైటు కెదురుగా గంభీరముద్రతో కూర్చుని ఉన్నారు. ఆయన ముఖంమీద ముడతలు చూస్తుంటే నాకు కొద్దిగా కాళ్లు వణికాయి.

మేము లోపలికి ఏ అడ్డంకీ లేకుండా చేరతామా ?

అనుకున్నంతా అయింది.

"అరేయ్, సత్యం!" అది రమాకాంతరావుగారి గొంతు.

బిత్తరపోయి ఇద్దరం నిలబడిపోయాము.

"నీ వివాహం లతతో నిశ్చయించాను. లగ్నం కూడా పది పదిహేను రోజుల్లోనే పెట్టించేస్తున్నాను."

నా గుండె దడదడలాడింది. వంచుకొని ఉన్న తల పైకెత్తటానికి భయపడ్డాను.

క్షణం గడిచిందో లేదో—రమాకాంతరావుగారు ఆయన కుర్చీలో లేరు. నా పక్కన ఉన్న సత్యం వడివడిగా తన గదిలోకి అడుగులువేస్తున్నాడు.

నేను ?!

వయస్సువచ్చి, లోకజ్ఞానం క్షుణ్ణంగా తెలుసుకున్న కొడుకుమీద ఏమిటీ మొండి పట్టుదల, అఘాయిత్యం ?

నాకు రమాకాంతరావుగారి మీద చిరాకువేసింది. కానీ చేయగలిగిందేముంది? మింగి ఊరుకున్నాను. ఒకవేళ

ధైర్యంచేసి, "అలా కాదు, బాబాయిగారూ—ఇలా" అని అంటే, "నీ సలహా ఎవడికి కావాలోయ్, బోడి సలహా?" అని ఇప్పటివరకు నా మీద ఉన్న ఆ కాస్త గౌరవం కూడా తుడిచివేసుకోవచ్చు. నా సలహాలకోసం కాదుకదా అసలు ఆయన నన్ను పిలిపించింది? ఇక నాకు మౌనమే శరణ్యం. మరో దారి లేదు.

తేరుకొని నేనూ గదిలోకి అడుగులు వేశాను.

సత్యం రెండు చేతుల మధ్య తలను ఇరికించుకొని బల్లమీద పడుకుని ఉన్నాడు. నాకు భయంవేసింది, వాడు ఆ సమయంలో ఏం అఘాయిత్యం చేస్తాడోనని.

అనునయంగా వెళ్లి వాడి భుజంమీద చేయి వేశాను. వాడు తలెత్తాడు. నేను ఉలిక్కిపడ్డాను. నీటికి నిలయాలైన వాడి కళ్లను చూడవలసి వస్తుందేమోనని భయపడుతున్న నన్ను మరింత హడలగొడుతూ వాడి కళ్ళలోని ఎర్రని చారలు నా వంక తీక్ష్ణంగా చూస్తున్నాయి. కందగడ్డల్లాంటి చెంపలు నన్ను కొట్టేటట్లున్నాయి. వాడు కోపంతో ఎదటి మనిషిని మింగేటట్లున్నాడు.

ఒక్కక్షణం కన్నార్పకుండా వాడి ముఖంలోకి చూచి, "తొందరపడకు" అని భుజం తట్టి ఇక అక్కడ ఉండకుండా బయటికి వచ్చేశాను.

అప్పటికి చీకటి బాగా ఇళ్ళను చుట్టేసింది. నక్షత్రాలు చీకటిని మింగాలని చూస్తున్నాయి. ఆ వాతావర

ణంలో కాస్త ప్రశాంతంగా వాకిట్లో అరుగుమీద కూర్చో వాలనిపించింది.

నాలుగు అడుగులు అటువైపు వేశాను. రమాకాంత రావుగారు—చుట్టతాగుతూ...

హరి భగవంతుడా! నాకు కనీసం ప్రశాంతత కూడా ఈ గృహంలో లభించదా? అడుగు వెనక్కి వేయబోయాను.

రమాకాంతరావుగారి గొంతు ఖంగుమన్నది. "రావోయ్, శేషూ, రా! ఇవి అంత సౌమ్యంగా నడుచుకోవాలనుకునే వాడికి రోజులుకావోయ్! మర్యాదగా అడిగి చూశానా-ఉఁహూఁ కొండెక్కి కూర్చున్నాడు! నా అంతట నేను ఆయుధం ఉపయోగించేటంతవరకు వాడు దిగివచ్చాడా? ఇక ఇప్పుడేం చేస్తాడు? కాదయ్యా—ఇక ఎదురు తిరిగాడే అనుకో—ఇక ఆ క్షణంనుండీ వాడికి ఇక్కడి ఒక్క నయా పైస మీద కూడా అధికారం ఉండదని వాడికిమాత్రం తెలియదూ? అంత తెలివితక్కువవాడా ఏం?...ఎమ్. బి. బి. ఎస్. చదువుతున్నాడు!" ఫెళ్లున నవ్వారు.

నాకు ఆ నవ్వు నవ్వుగా అనిపించలేదు. అగ్నిపర్వతాలు భగభగమంటున్నట్లనిపించింది.

ముళ్లమీద కూర్చున్నట్లు ఒక అరగంట అక్కడే కూర్చున్నాను.

"జీవితమంతా సత్యం ఉద్దేశ్యంలోలాగా నరక ప్రాయంగా నడిచినాసరే, అతడు లతను వివాహం చేసుకో

వలసిందే! కాదన్నాడో మరుక్షణంనుండి ఆ ఇంటి గడప తొక్కటానికే వీల్లేదు! అక్కడి నయాపైసా ముట్టుకోవ టానికి వీల్లేదు!'' రమాకాంతరావుగారి అరగంట మాటలకు సారాంశం అది.

ఆ విషయంలో కూడా ఆయన తెలివిగలవాడనే అనిపించుకున్నాడు. ఆ విషయం నాముందు అంటే, తనే నేరుగా కొడుకుతో చెప్పకుండా, నేను వాడికి అప్పచెబు తాను గదా?

ఒప్పుకున్న తరువాత చేయక తప్పేదేముంది? ఏమైనా త్వరలోనే ఇక్కడి నా పనులన్నీ పూర్తిచేసుకోవాలి. రేపు సాయంత్రానికన్నా నన్ను ఈ వ్యూహంనుండి రక్షించే భాస్కరం తంతి రావచ్చు.

అందుకనే మరునాడు ఉదయం కాఫీ తాగిన తరు వాత వాడు గదిలో ఒంటరిగా కూర్చున్నప్పుడు ఆ విషయం కదిలించి, రమాకాంతరావుగారి ఉద్దేశ్యమంతా చెప్పేశాను.

చెప్పి తలెత్తి వాడి ఆకారాన్ని చూచి హడలి పోయాను. లేచి నిలబడి పిడికిలి బిగించి నిప్పులు కురి పిస్తున్నాడు సత్యం!

''ఆయనే అంత పట్టుపట్టుతున్నప్పుడు నేను మాత్రం తక్కువ తిన్నానా? నేను ఈయన ఆస్తే లేకపోతే బతక లేకపోను. చదివిన చదువుకు తొంభైరూపాయల గుమాస్తా గిరీ దొరక్కపోదుగా? పోనీ, దొరకదే అనుకో—ఇంత

విషమైనా తింటానుగానీ, లతను మాత్రం వివాహం చేసుకోను.''

చిరాకుగా, ''ఎవరో ఒకరు మెట్టు దిగందే...'' అంటున్న నా మాట పూర్తి కాకముందే నా భుజం పట్టుకొని బలంగా ఊపుతూ, ''అంటే నీ ఉద్దేశ్యం కూడా మా నాన్న చెప్పినట్లు ఆ అమ్మాయిని వివాహం చేసుకోవాలనా?'' అన్నాడు.

వాడి చూపులకు నేను తట్టుకోలేకపోయాను. ఒక విధంగా వాడి ప్రశ్నకూ తట్టుకోలేకపోయినట్లే. దానికి నేను సమాధానం చెప్పలేను!

సాయంత్రం నాలుగు గంటల సమయంలో భాస్కరం నుండి వచ్చిన అర్జెంటు టెలిగ్రామ్ చూచినప్పుడు నేను జీవితంలో అంతవరకు ఎన్నడూ పొందని ఆనందాన్ని పొందాను.

ఆ టెలిగ్రామ్ అడ్డుపెట్టుకొని, పెట్టె, బెడ్డింగు సర్దుకున్నాను.

మేము ప్లాట్‌ఫారం మీదికి వెళ్ళేటప్పటికి ఇంకా బండికి అరగంట టైము ఉందన్నారు. ప్లాట్‌ఫారం మీద చివరగా జనంలేనిచోట ఇద్దరం కూర్చున్నాము. సత్యంతో ఏమి మాట్లాడాలో నాకేం తోచటంలేదు. నా మనస్సులో వాడికేదో చెప్పాలని ఉంది. కానీ మాటల రూపంలో చెప్పలేకపోతున్నాను. వాడూ అదే పరిస్థితిలో ఉన్నట్లుగా వాడి ముఖమే చెబుతున్నది.

ఆ మౌనం చూస్తుంటే ఏదో అమూల్యమైన కాలం మా చేతిలో చిక్కకుండా వెళ్ళిపోతున్నదే అనిపిస్తున్నది. నేను ఏం చెప్పను? ఏలాంటి సలహా ఇవ్వగలను? వాళ్ళ నాన్న పన్నిన భయంకర వ్యూహంనుండి వాడి నెలా రక్షించగలను?

రైలు వచ్చింది.

పోర్టరు పెట్టె, బెడ్డింగు లోపల పెట్టాడు.

నేను కిటికీ పక్కగా కూర్చున్నాను.

అకస్మాత్తుగా వాడి చేతిని నా చేతిలోకి తీసుకున్నాను. వాడి ముఖంలోకి చూస్తుంటే నా కళ్ల వెంట నీళ్లు గిర్రున తిరిగాయి.

"సత్య!" అన్నాను, నా బాధను కప్పిపుచ్చుకుంటూ. "ప్రయత్నించి చూడు. ఫలితముంటే సరే. తను పట్టిన కుందేటికి మూడేకాళ్ళని మీ నాన్న మొండిగా కూర్చుంటేమాత్రం పెండ్లి రెండు మూడు రోజులుండనగానే నా దగ్గరికి వచ్చేసెయ్యి. మనం జీవించలేకపోముగా?" అన్నాను.

నా గొంతు జీరబోయింది. వాడికి నే నివ్వగలిగిన సలహా అదొక్కటే!

రైలు ఇంజను కర్కశంగా కూసి, మా ఇద్దరినీ విడదీస్తూ బయలుదేరింది. ఒక్కక్షణం దీనాతిదీనంగా ఒకళ్ళ కళ్లలోకి ఒకళ్లం చూచుకున్నాము. మరువలేని క్షణం అది!

* * *

మా ఊరు తిరిగివచ్చానన్న మాటేగానీ మనస్సు మనస్సులో లేదు. మిత్రుడికి సహాయం చేయలేక పోయాననే ఆవేదన నన్ను పీడిస్తున్నది. అమితంగా బాధపడ్డాను. వాడి నుండి ఏలాంటి వార్త వస్తుందోనని రోజూ భయంతో ఎదురు చూసే వాడిని.

నెలరోజులు ఓపికపట్టినా, వాడినుండి ఏలాంటి ఉత్తరమూ రాలేదు. కాలం గడుస్తున్న కొద్దీ నాలో అసహనమూ, భయమూ ఎక్కువ కాసాగాయి. చివరికి ఉండబట్టలేక నాలుగైదు ఉత్తరాలు కూడా వ్రాశాను. ఫలితం శూన్యం.

చివరికి ఎట్లాగైతేనేం, నేను గుంటూరునుండి వచ్చిన తరువాత మూడు నెలలకు సత్యంనుండి ఉత్తరం వచ్చింది. ఎంత ఆదుర్దాతో దానిని విప్పి తీసి చూచానో, అది చదివి అంతగా నిర్ఘాంతపోయాను.

"శేషగిరీ!

మానాన్న ప్లేటు ఫిరాయించాడోయ్ భగవాన్లు! నేను లతను వివాహం చేసుకోవాలనే కోరిక ఆయన ఈ రోజున కోరటం లేదు. పైపెచ్చు వద్దంటున్నాడు. ఎందుకా అని ఆశ్చర్యపోతున్నావా? అదేమంతా అనుకోని విషయం కాదు. లత తల్లి అయిన రాజ్యలక్ష్మమ్మగారి ఆస్తి వ్యవహారాల్లో కొన్ని గుట్లు మా నాన్న గుప్పిటిలో ఉన్నాయి. ఫలితంగానే ఈ మూడు నెలల్లో రోజురోజుకూ ఆమె ఆస్తి తరిగిపోవటం, మా నాన్నగారి ఆస్తి పెరగటం సంభ

వించింది. ఈలాగే నన్ను వాళ్ళకు ఎరగా ఇంకొక రెండు మూడు నెలలు చూపించి, వాళ్ళను బికారులుగా చేస్తాడనేది నిస్సందేహం! వాళ్ళను చూస్తుంటే నాకు జాలివేస్తున్నది, శేషగిరీ! మా నాన్న ఎంతకైనా తగునని నీకు తెలుసుగా?

ఏమిటో, శేషగిరీ! ఈ పెద్దలు ఎందుకు ఈలాంటి ఘోరాలు చేస్తారో నాకు అర్థంకాదు. చివరికి వెళ్ళే రోజున ఏం తీసుకు వెళ్తారని? ఈ పాపంతప్ప ఏమీ వెంట రాదు. ఒకరోజున శోభాయమానంగా వెలిగిన ఆ కుటుంబాన్ని రోడ్లమీద బికారులుగా తిరుగుతుంటే ఎలా చూడగలం? మానాన్న చేస్తున్న పాపానికి—అంతే శేషగిరీ—నేను లతను వివాహం చేసుకోవటంకన్నా గత్యంతరం లేదు. అదే నా నిశ్చయం! మా నాన్న వద్దన్నా రిజిస్టర్ మారేజ్ అయినా చేసుకుంటాను.

నీ మిత్రుడు,

సత్యం"

———